నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, బుధవారం 14 ఆగస్టు 2024 RANGAREDDY



అదనపు కలెక్టర్ కార్యాలయంలో అధికారుల తనిఖీలు

రంగారెడ్డి జిల్లా 'రెవెన్యూ'లో అవినీతి దందా..

ఉన్నతాధికారులే పాత్రధారులు

# కంచే చేను మేస్తే..!

**భూ సంబంధిత ఆరోపణలపై జిల్లాల్లో పలువురు కలెక్టర్లపై బదిలీ వేటు**

**గత కలెక్టర్ హోలికేరి హయాంలో అక్రమంగా 98 భూ రిజిస్ట్రేషన్లు**

**తాజాగా.. లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అదనపు కలెక్టర్**

**2016లోనూ ఏసీబీకి పట్టుబడ్డ అదనపు కలెక్టర్**

**ఉన్నతాధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు**

రంగారెడ్డి, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లాలోని 'రెవెన్యూ' శాఖకు అవినీతి మకిలీ పట్టుకున్నది. పారదర్శక సేవలు, అక్రమాలకు చెక్ పెట్టేలా ఎన్ని సంస్కరణలు చేపట్టినా.. అవినీతి, అక్రమాలు ఆగడం లేదు. కంచే చేను మేసిన చందంలా.. అక్రమాలను అడ్డుకోవాల్సిన ఉన్నతాధికారులే అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారు. ఇష్టారాజ్యంగా లంచాలు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం ఏకంగా కలెక్టరేట్ కార్యాలయాన్నే అడ్డాగా చేసుకుంటున్నారు. దీంతో కిందిస్థాయి అధికారుల్లోనూ భయం లేకుండా పోతున్నది. ఏ శాఖకు సంబంధించి ఆ శాఖ ఉన్నతాధికారి బాస్‌గా వ్యవహరిస్తూ లంచాల జాడ్యాన్ని కొనసాగిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇక్కడ కలెక్టర్‌గా పని చేసిన భారతిహోలికేరి హయాంలో ఏకంగా 98 భూ రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరిగాయి. దీంతో ఆమెపై బదిలీ వేటు పడింది. గతంలో ఇక్కడ పని చేసిన కలెక్టర్లు అమయ్‌కుమార్, హరీశ్‌లు సైతం భూ సంబంధిత వ్యవహారాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలోనే ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. 2016లో అప్పటి అదనపు కలెక్టర్ ఏసీబీకి పట్టుబడ్డారు. తాజాగా.. రంగారెడ్డి జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఈ-సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డిలు ఏసీబీ వలకు చిక్కడంతో ఇక్కడ అవినీతి ఏమేర ఉందో అర్థమవుతున్నది.

### డిజిటల్ 'కీ' ఉన్నా..

### ఆగని అక్రమాలు..

ఒక అధికారి సంతకాన్ని సులువుగా ఫోర్జరీ చేసే విధానానికి స్వస్తి పలకాలన్న ఉద్దేశంతో ధరణిలో కేసీఆర్ ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌తోపాటు ఆర్డీవో, తహసీల్దార్లకు డిజిటల్ సంతకాన్ని ఇచ్చింది. సంప్రదాయ చేతి సంతకంతో పోలిస్తే ఈ డిజిటల్ సంతకం ఎక్కువ భద్రత ఉంటుందనే ఉద్దేశంతో ధరణిలో భూముల రిజిస్ట్రేషన్ పరమైన అంశాల్లో డిజిటల్ 'కీ'ని కీలకంగా చేసి అప్పటి ప్రభుత్వం అమలు చేసింది. అయినప్పటికీ జిల్లాలో గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో 98 ఫైళ్లకు సంబంధించి ధరణిలో అక్రమ లావాదేవీలు జరిగాయి. నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సైతం రిజిస్ట్రేషన్లు జరిగాయి. కలెక్టర్ దగ్గర దీనికి సంబంధించి 'కీ' ఉండగానే ఈ వ్యవహారం చోటుచేసుకున్నది. దీన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం అప్పటి కలెక్టర్ భారతిహోలికేరిపై బదిలీవేటు వేయగా.. బాధ్యులైన ఇద్దరు పొరుగు సేవల ఉద్యోగులపై పోలీసు కేసు నమోదు అయింది. గతంలో కందుకూరు ఆర్డీవో కార్యాలయంలోనూ ధరణి ఆపరేటర్‌పై ఆరోపణలు రాగా.. కలెక్టరేట్‌కు అటాచ్ చేశారు. ఇటీవల మంచాల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ 'కీ'ని ఉపయోగించి అక్రమంగా ధ్రువీకరణ పత్రాలను జారీ చేసిన ఆపరేటర్‌ను విధుల నుంచి తొలగించారు. కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై ఓ ఆర్మీ జవాన్ బట్టబయలు చేయడం అప్పట్లో సంచలనం రేపింది. ఈ తరహా ఘటనలు జిల్లాలో కోకొల్లలు.

### పైసా లేనిదే పనికాదు..

ఏ పని కావాలన్నా.. పైరవీ కారులు చెప్పాలి. పైసా లేనిదే పని కాదు. చిన్నస్థాయి ఉద్యోగి నుంచి ఉన్నతస్థాయి అధికారి వరకు అంతా వసూళ్లే. కొన్ని కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తులదే పెత్తనమైతే.. సిబ్బంది దళారులుగా వ్యవహరిస్తున్నారు. మ్యుటేషన్ మొదలుకుని నిషేధిత జాబితాలో ఉన్న భూముల వరకు ఓ రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజు చెల్లించినప్పటికీ లక్షల్లో వసూలు చేస్తున్నారు. పైసలిస్తే..అసైన్డ్ భూములకూ పట్టాలిస్తున్నారన్న విమర్శలున్నాయి. వారసత్వం, ఫౌతీ వాటికీ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. లక్షల్లో జీతాలు తీసుకునే ఉన్నతాధికారులు ఇలా.. బరితెగించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై మొరపెట్టుకునేందుకు కలెక్టరేట్‌కు వస్తే.. ఇక్కడా అదే తంతు నడుస్తుండడంతో బాధితులు వాపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి జిల్లాలోని రెవెన్యూను ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆహార భద్రతకు ఇక్రిసాట్ సహకారం

సిటీబ్యూరో, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : ఆహార భద్రత, పోషకాహారం అందించడమే లక్ష్యంగా ఇక్రిసాట్ చేస్తున్న పరిశోధనలతో పుష్కలమైన విత్తన సంపత్తి పెరుగుతుంది. వ్యవసాయ రంగాన్ని ఆధునీకరిస్తూనే, శాస్త్రీయ విధానంలో దిగుబడిని పెంచేలా పరిశోధనలు చేస్తుండగా కొత్త వంగడాలను అభివృద్ధి చేస్తున్నారు. ఈ క్రమంలో ఇక్రిసాట్ అభివృద్ధి చేసిన 109 వంగడాలను ఇటీవల ప్రధాని మోదీ విడుదల చేయగా... వీటిని ఆఫ్రికా లాంటి దేశాలకు సరఫరా చేస్తోంది. అధిక దిగుబడి, తక్కువ సాగు నిర్వహణతో తక్కువ పంట కాలం ఉండే 61 రకాల పంటల వంగడాలను అభివృద్ధి చేసింది. ఇక్రిసాట్ డెవలప్ చేసిన పంటలతో రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని పరిశోధకులు తెలిపారు. ఇప్పటివరకు ఇక్రిసాట్ వందల రకాల వంగడాలను అభివృద్ధి చేయడంతోపాటు ప్రత్యేక జన్యు బ్యాంకును అందుబాటులోకి తీసుకువచ్చామని, ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సదస్సులో ఇక్రిసాట్ డెవలప్ చేసిన వంగడాలను ప్రదర్శించినట్లు నిర్వాహకులు వివరించారు. జొన్న హైబ్రిడ్ ఎస్‌పీహెచ్ 1943, కందుల రకం నామ్-88, పెర్ల్‌మిల్లెట్ హైబ్రిడ్ పూసా 1801 వంటి వంగడాలను ఇక్రిసాట్, ఇతర అగ్రి పరిశోధన సంస్థలతో కలిసి రూపొందించామని, రానున్న రోజుల్లో అధిక దిగుబడితోపాటు, వాతావరణ మార్పులను తట్టుకునే, బయోఫోర్టిఫైడ్ పంటలను అభివృద్ధి చేయనున్నట్లు ఇక్రిసాట్ వర్గాలు పేర్కొన్నాయి.



ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి పోసి చదును చేసిన 'రియల్' వ్యాపారులు



ఆరుట్ల పడమటి చెరువు పక్కన వ్యాపారి కొనుగోలు చేసి నిర్మించిన ముఖద్వారం

# చెరువు మాయం!

## కబ్జా కోరల్లో ఆరుట్ల పడమటి చెరువు

**ఎఫ్‌టీఎల్ భూమిలో మట్టి పోసిన రియల్ వ్యాపారులు**

**చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం**

మంచాల, ఆగస్టు 13 : ఎన్నో ఏండ్లుగా పంటల సాగులో అన్నదాతలకు అండగా నిలుస్తున్న పడమటి చెరువు.. మట్టితో నిండిపోతున్నది. రియల్ వ్యాపారులు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూమిలో మట్టి పోసి చదును చేసి దర్జాగా కబ్జాలకు పాల్పడుతున్నారు. విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని ఆరుట్ల గ్రామానికి వెళ్లే ప్రతి ఒక్కరికీ ముందుగా స్వాగతం పలికేది పడమటి చెరువు.. చెరువు శిఖం ఎకరా 20 గుంటలు ఉండగా, దానికి నీటి నిల్వ సామర్థ్యం గల ఎఫ్‌టీఎల్ సుమారు ఆరు ఎకరాల వరకు ఉన్నది. ఆరుట్ల పడమటి చెరువు పక్కన సర్వే నంబర్ 1602 నుంచి 1621 వరకు 30 ఎకరాల పట్టా భూమి ఉన్నది. అందులో కొంత పట్టా భూమి ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుండడంతో ఈ భూమిని రైతుల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. రాజకీయ పలుకుబడితో అధికార యంత్రాంగాన్ని ఉపయోగించి ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూమిని ఆక్రమించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఊరికి ఆధారమైన చెరువు కబ్జా గురవుతున్నా అధికార యంత్రాంగం కండ్లు మూసుకున్న కబోదిలా వ్యవహరిస్తున్నది... చెరువు నిండితే బంగారు పంటలు పండుతాయని కొండంత ఆశతో ఉన్న అన్నదాత తల పొట్టకొడుతున్న వ్యాపారుల కొమ్ముకాస్తున్నది. సమైక్యవాదుల పాలనలో చెరువులు మట్టిదీపంతలుగా మారితే, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో చెరువులు, కుంటల ఆనవాళ్లు లేకుండా పోయే పరిస్థితి దాపురిస్తున్నది. గ్రామాల్లో పొలాలకు సాగునీరు లేక జనాలు వలసబాట పట్టిన రోజులు మళ్లీ వచ్చేటట్టుగా కనిపిస్తున్నది. సర్వ మానవులకు జీవనాధారం జలమే.. జలం ఉంటేనే మనుగడ సాధ్యమని భావించిన బీఆర్ఎస్ సర్కారు చెరువుల పునరుద్ధరణకు అధిక నిధులు కేటాయించి పునర్జీవం పోసింది. అటువంటి చెరువులు మళ్లీ కబ్జా కోరల్లో చిక్కుకుంటున్నాయని పల్లెజనం ఆందోళన చెందుతున్నది. మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామంలోని పడమటి చెరువు రియల్ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కుకున్నది. వ్యాపారుల చెర నుంచి చెరువును విడిపించి న్యాయం చేయాలని ఆ గ్రామ అన్నదాతలు ప్రభుత్వాన్ని వేడుకొంటున్నారు.

### భూముల ధరలకు రెక్కలు..

ఆరుట్ల పడమటి చెరువు పక్కన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఓ కంపెనీ పేరుతో భూమిని కొనుగోలు చేసి అందులో రోడ్లు వేయడంతో పాటు భూమిని చదును చేశారు. పడమటి చెరువుకు సుమారు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆరు ఎకరాల భూమి ఉండాల్సి ఉండగా, అందులో కొంత మేర మట్టి పోసి చదును చేసి కబ్జా చేశారు. చెరువులు అన్యాక్రాంతం కాకుండా సర్వే చేసి వాటి వాస్తవ హద్దులను గుర్తించాల్సిన రెవెన్యూ, జల వనరుల శాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరం.

### ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి పోసిన వ్యాపారులు..

పడమటి చెరువులో గతంలోనే ఇరిగేషన్ శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్ పరిధి హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. చెరువులో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి ఎవుసాన్ని పండుగ చేయాలన్న సంకల్పంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం రాజకీయ నాయకుల అండదండలతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా కబ్జాలు చేస్తున్నారు. పడమటి చెరువు కబ్జా కోరల్లో చిక్కుకున్నా అధికార యంత్రాంగం మాత్రం పట్టించుకోకపోవడంపై ఆ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పడమటి చెరువులో మట్టి పోసి భూమిని చదును చేస్తున్నారన్న విషయాన్ని ఇరిగేషన్ శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లగా ఎఫ్‌టీఎల్ పరిధిలోని పోసిన మట్టిని తొలగించాలని గతంలోనే చెప్పామంటూ విషయాన్ని దాట వేశారు.

# సర్కారు దవాఖానలకు సుస్తి



పరిగి ప్రభుత్వ దవాఖానలో బారులుదీరిన రోగులు

- **ప్రభుత్వ వైద్యం.. అందని దైన్యం**
- **అధ్వానంగా ప్రభుత్వ దవాఖానల్లో పరిస్థితులు**
- **సమయానికి వైద్యులు రాక ఇబ్బందులు పడుతున్న రోగులు**
- **వారానికి ఒకరోజు మాత్రమే విధులకు హాజరవుతున్న వైద్యవిధాన పరిషత్ వైద్యులు**
- **జిల్లా దవాఖానలో పారిశుధ్యం అస్తవ్యస్తం**
- **మందులు బయటే కొనాలని చెబుతున్న డాక్టర్లు**

వికారాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో పరిస్థితులు అధ్వానంగా మారాయి. మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశించే పేదలకు నిరాశే మిగులుతున్నది. రూ.కోట్లు వెచ్చిస్తున్నామని సర్కారు గొప్పలు చెబుతున్నప్పటికీ పేదలకు మాత్రం వైద్యం అందని ద్రాక్షలా మారింది. సరైన సౌకర్యాలు లేకపోవడం.. సమయానికి వైద్యులు రాకపోవడం వంటి కారణాల వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ దవాఖానల విజిట్‌లో భాగంగా మంగళవారం 'నమస్తే తెలంగాణ' జిల్లాలోని వైద్యశాలల్లోని పరిస్థితిని పరిశీలించింది. ఎక్కడిగొంగడి అక్కడే అన్నట్లు సమస్యలు కుప్పలుతెప్పలుగా పేరుకుపోయి ఉన్నాయి. సమయానికి వచ్చి రోగులకు వైద్యం అందించే డాక్టర్లు రాకపోవడం, ఎక్కడ చూసినా చెత్తాచెదారంలో దవాఖాన అంతా అస్తవ్యస్తంగా ఉండడం కనిపించింది. దీనికితోడు కనీస వసతులు లేక దవాఖానకు వచ్చిన రోగులు, వారివెంట వచ్చిన జనం అవస్థలు పడే బాధాకరమైన ఘటనలు కంటపడ్డాయి. ప్రధానంగా జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆధీనంలోని ప్రభుత్వ జిల్లా దవాఖానతోపాటు మాతాశిశు, ఏరియా వైద్యశాలల్లో పని చేస్తున్న అధికారులు, వైద్యులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వైద్యావిధాన పరిషత్ ఆధీనంలో జిల్లాలో పని చేస్తున్న డీసీహెచ్ఎస్, ప్రభుత్వ ఏరియా వైద్యశాలల సూపరింటెండెంట్లు, వైద్యుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైద్యావిధాన పరిషత్ ఆధీనంలో పని చేస్తున్న డీసీహెచ్ఎస్, సూపరింటెండెంట్లు మొదలుకొని వైద్యుల వరకు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. డీసీహెచ్ఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించే ప్రదీప్‌కుమార్ తన బాధ్యతలను విస్మరించి పరిగిలోని ఓ ప్రైవేటు క్లినిక్‌లోనే సేవలందిస్తున్నారు. సంబంధిత సూపరింటెండెంట్లు, వైద్యులు కూడా ప్రైవేటు ప్రాక్టీస్‌కే పరిమితమవుతున్నారని తీవ్ర విమర్శలు ఉన్నాయి. బాధ్యతాయుతమైన డీసీహెచ్ఎస్ రెండు రోజులకోసారి వికారాబాద్‌లోని సీహెచ్‌సీలో గంటపాటు నామమాత్రంగా విధులను నిర్వర్తిస్తుండడం బాధాకరం. ప్రభుత్వ జిల్లా దవాఖానతోపాటు మాతాశిశు సంరక్షణాసుపత్రి, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల్లో పని చేస్తున్న వైద్యుల్లో మెజార్టీ వైద్యులు సొంత క్లినిక్‌లకే పరిమితమై సర్కార్ దవాఖానకు వచ్చే పేదలకు తీవ్ర అన్యాయం చేస్తుండడం స్పష్టంగా కనిపిస్తున్నది. వీరిని పర్యవేక్షించాల్సిన డీసీహెచ్ఎస్‌తోపాటు ప్రభుత్వ ఏరియా దవాఖానల సూపరింటెండెంట్లు రూ.లక్షల్లో జీతాలు తీసుకుంటూ సొంత క్లినిక్‌లకే ప్రాధాన్యమిస్తుండడం మరీ విడ్డూరం. దీంతో సర్కారు దవాఖానకు వచ్చే రోగులు చేసేదేమీలేక ప్రైవేటు దవాఖానలవైపు వెళ్తున్నారు. డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ వైద్యుల తీరు మారకపోవడం వారి నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తున్నది. ఇక మందుల విషయానికి వస్తే కొన్ని మందులు బయట తెచ్చుకోవాలని వైద్యులే సూచిస్తుండడం రోగులను ఆందోళన గురిచేస్తున్నది.

### జిల్లా దవాఖానలో రోగుల అవస్థలు..

తాండూరులోని ప్రభుత్వ జిల్లా దవాఖానలో వైద్యులు సమయానికి లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకే పెద్ద దవాఖాన పరిస్థితులు మాత్రం అధ్వానంగా ఉన్నాయి. జిల్లాసుపత్రిలో వైద్యులతోపాటు నర్సులు సరిపోను ఉన్నప్పటికీ విధులకు హాజరుకావడం లేదు. రోజుకో వైద్యుడి చొప్పున వారానికి ఒకరు హాజరవుతూ చుట్టపుచూపులా వచ్చి వెళ్తున్నారు. తాండూరులోని జిల్లాసుపత్రిలో రోజంతా వైద్య సేవలు అందాల్సి ఉండగా, మధ్యాహ్నం వరకే వైద్యులుండడం, తదనంతరం నర్సులతో కాలం వెళ్లదీస్తుండడం గమనార్హం. ఇక పారిశుధ్యం పరిస్థితి అయితే కొత్త రోగాలకు వెల్‌కం చెబుతున్నట్లుగా ఉన్నది. డ్రైనేజీ పైప్‌లైన్ల లికేజీలతో జిల్లా సుపత్రి పరిసరాల్లో మురుగు కంపుతోపాటు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.

### పరిగి నియోజకవర్గంలో..

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యపు వైఖరి పేదలకు నాణ్యమైన వైద్యం అందడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సర్కారు దవాఖానల్లో వైద్య సేవలు అద్భుతంగా అందాయి. నిధులు కేటాయింపులోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసింది. వైద్యుల నియామకాలనూ చేపట్టింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సర్కారు దవాఖానలను గాలికొదిలేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నది. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ పరిగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పేర్కొనవచ్చు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 ఆగస్టు 3వ తేదీన పరిగి దవాఖానను 100 పడకల ఏరియా దవాఖానగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు సివిల్ వర్క్స్ కోసం రూ.26 కోట్లు మంజూరు చేసింది. తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దవాఖాన అప్‌గ్రేడేషన్‌పై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ క్యాడర్ స్ట్రెంత్‌తోనే కొనసాగుతున్నది. వైద్య విధాన పరిషత్ పరిధిలో కొనసాగుతున్న దవాఖానలో ప్రస్తుతం మొత్తం వైద్యులు, సిబ్బంది కలిపి 46 మంది పని చేస్తుండగా వారిలో 12 మంది డిప్యుటేషన్‌పై పని చేయడం జరుగుతున్నది. దవాఖానలో 11 మంది వైద్యులకుగాను ఒక డాక్టర్ ప్రసూతి సెలవులో ఉండగా పది మందికి కేవలం వైద్యశాల సూపరింటెండెంట్ ఒక్కరే వైద్య విధాన పరిషత్ నుంచి కొనసాగుతుండగా మిగతా వారంతా వైద్య, ఆరోగ్య శాఖ డాక్టర్లు, సిబ్బంది ఉండడం గమనార్హం. 100 పడకల దవాఖానగా అప్‌గ్రేడ్ చేయడానికి అనుగుణంగా క్యాడర్ స్ట్రెంత్ నిర్ణయిస్తే వైద్యుల సంఖ్య చాలా పెరుగడంతోపాటు వివిధ విభాగాలకు చెందిన వైద్యులు ఇక్కడ పని చేస్తారు. తద్వారా అన్ని విభాగాల వైద్యసేవలు ఇక్కడే అందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రోజు ఓపీలో సుమారు 400 మందికిపైగా వైద్యసేవలు అందుతున్నాయి. వైద్యుల సంఖ్య పెరిగితే మరింత మందికి వైద్యం అందనున్నది. ఇటీవలి కాలంలోనే సుమారు 10 మందికి పైగా డెంగీ రోగులకు వైద్యం అందించారు. నిత్యం పది మందికి పైగానే జ్వరాలు, డయేరియా తదితర వ్యాధులతో దవాఖానలో చేరుతున్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని చెబుతున్నా.. కొన్నింటిని బయట కొనాల్సి వస్తున్నదని రోగులు పేర్కొంటున్నారు. పేరుకే పెద్దాసుపత్రిగా పరిగి సర్కారు దవాఖాన ఉన్నదని చెప్పవచ్చు. పరిగి దవాఖానలో ఎక్స్‌రే మిషన్ లేకపోవడంతో చిన్నపాటి ఎక్స్‌రేకు సైతం ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సి వస్తున్నదని రోగులు వాపోతున్నారు. ఎక్స్‌రే, స్కానింగ్ కోసం ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లడం వల్ల రోగులపై ఆర్థిక భారం పడుతున్నది. ఇతర టెస్ట్‌లు దవాఖానలోనే చేపడుతుండగా ఎక్స్‌రే యంత్రం ఏర్పాటు అంశంపై ఉన్నతాధికారులు సైతం చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు దవాఖాన చుట్టూ కలుపు మొక్కలు విస్తరించి ఉన్నాయి. పాత దవాఖాన భవనం వెనకాల, కొత్త భవనం పక్కన కలుపు మొక్కలు విపరీతంగా పెరుగడంతో ఎక్కడ నుంచి పురుగుబూసి వస్తుందోనని జనం భయాందోళనకు గురవుతున్నారు. పరిగి నియోజకవర్గంలోని దోమ, కులకచర్ల, పూడూరు మండలాల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం ఇటీవల రోగుల సంఖ్య పెరిగింది. ప్రధానంగా సీజనల్ వ్యాధుల బారిన పడిన రోగులు వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్తున్నారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులను పెంచాల్సిన అవసరం ఉన్నదని పేర్కొంటున్నారు.



వికారాబాద్ ప్రభుత్వ దవాఖానలో కిటకిటలాడుతున్న రోగులు



సేవ్ దామగుండం సేవ్ వికారాబాద్ చర్చా వేదికలో పాల్గొన్న పలువురు ప్రముఖులు

## దామగుండాన్ని కాపాడుకుందాం..

**12 లక్షల చెట్ల కొట్టివేతను ఆపివేద్దాం**

**రాడార్ ప్రాజెక్టును అడ్డుకోకుంటే వృక్ష సంపద, వన్యప్రాణులకు భారీ నష్టం**

**బుగ్గ రామలింగేశ్వర ఆలయానికీ పొంచి ఉన్న ముప్పు**

**సేవ్ దామగుండం.. సేవ్ వికారాబాద్.. చర్చా వేదికలో వక్తలు**

వికారాబాద్, ఆగస్టు 13 : భారీగా వన్య ప్రాణులు.. పెద్దసంఖ్యలో వృక్ష సంపద కలిగిన దామగుండాన్ని నాశనం చేస్తే సహించేది లేదని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ అన్నారు. సేవ్ దామగుండం -సేవ్ వికారాబాద్ అనే అంశంపై ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వికారాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో చర్చా వేదిక జరిగింది. ముఖ్యఅతిథులుగా జేఏసీ మాజీ జిల్లా చైర్మన్ కే శ్రీనివాస్, పూడూరు మండల మాజీ ఎంపీపీ మల్లేశం, బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్, రవి బాబు, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ కన్వీనర్‌లు పాల్గొని మాట్లాడారు. అనంతగిరి కొండల్లోని సహజమైన అటవీ భూములను భారత నౌకాదళానికి రాడార్ స్టేషన్ కోసం కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయానికి ప్రతిస్పందించారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా హైదరాబాద్, వైజాగ్, ముంబై, జమ్మూ, భోపాల్ దేశవ్యాప్తంగా 13 ఇతర ప్రదేశాలతో సహా 18 నగరాల్లో ప్రదర్శనలు జరిగాయని గుర్తు చేశారు. ఇందులో అంచనా ప్రాజెక్ట్ వ్యయం రూ. 2,500 కోట్లు అని, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రాడార్ ప్రాజెక్టును ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం ఉన్నదన్నారు. దశాబ్ద కాలంగా దామగుండం అటవీ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ, పర్యావరణ వేత్తలు ఈ ప్రాజెక్ట్ ప్రభావాల గురించి తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారని వక్తలు వివరించారు. వికారాబాద్ జిల్లా, పూడూరు మండలంలోని దామగుండం అడవులు జీవవైవిధ్యంతో సమృద్ధిగా ఉన్నాయి. ఔషధ మొక్కలు, విలువైన వృక్ష, జంతు జాలంతో సహా వందలాది అరుదైన వృక్ష జాతులు ఉన్నాయని వారు వివరించారు. ఈ ప్రాజెక్టు వల్ల 2,900 ఎకరాల అటవీ భూమిని క్లియర్ చేయడానికి దాదాపు 12 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో యాంటెనా పార్క్ కోసం 1,400 ఎకరాలు, సాంకేతిక ప్రాంతాల కోసం 1,090 ఎకరాలు, అధికారిక నివాస సముదాయాల కోసం 310 ఎకరాలు ''సేఫ్ జోన్''గా 100 ఎకరాలు ఉన్నాయన్నారు. 20 గ్రామాల్లోని దాదాపు 60,000 మంది ప్రజలపై ఈ రాడార్ స్టేషన్ ప్రభావం పడుతున్నదన్నారు. మూసీ, కాగ్నా వంటి స్థానిక నదులపై కూడా దీని దుష్ప్రభావాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ ప్రాంతం చారిత్రాత్మకంగా మతపరంగా బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంపై ప్రభావం పడుతున్నదన్నారు. కలిసికట్టుగా దామగుండాన్ని రక్షించుకుందామని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘమిత్ర ఎన్‌పీఎం మీరా, బీఆర్‌టీఎం జిల్లా అధ్యక్షుడు కృష్ణ, శివరాజ్, రామన్న, శ్రీనివాస్ గౌడ్ ,వెంకటయ్య,వెంకటేశం, రుచిత, శ్రీనివాస్ ,జాకీర్, వెంకటేశం, మల్లేశం, నిఖిత, యాదయ్య, శ్రీకాంత్, రాములు తదితరులు పాల్గొన్నారు.